సాక్షి ఖమ్మం

ఆదివారం ౹ 8 ౹ జనవరి ౹ 2023



వెల్‌నెస్ కాదు.. డల్‌నెస్!

జిల్లా పెద్దాస్పత్రిలో ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్ల కోసం ఏర్పాటుచేసిన వెల్‌నెస్ సెంటర్ ద్వారా సరైన వైద్యం అందడం లేదు. 12లో



ప్రశాంతంగా ఆగమ పరీక్షలు

అర్చకులకు గుర్తింపు కోసం రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 12లో

గరిష్టం / కనిష్టం
31° / 12°

వాతావరణం

ఆదివారం ఉదయం, సాయంత్రం తర్వాత చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్న ఉష్ణోగ్రతలు కూడా తక్కువగా నమోదవుతాయి.

న్యూస్‌రీల్

జమలాపురం శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారి పాదం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని స్వామివారి పాదానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అలాగే, స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించగా అర్చకులు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యాన నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత శ్రీవారికి పల్లకీ సేవ చేయగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, తదితరులు పాల్గొన్నారు.

10న పీఎంఈజీపీ పథకంపై అవగాహన

ఖమ్మంఅర్బన్: ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) పథకంపై ఈనెల 10న అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ కె.అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో 10వ తేదీన ఉదయం 10–30 గంటలకు సదస్సు మొదలవుతుందని పేర్కొన్నారు. వివిధ బ్యాంకులతో పాటు పరిశ్రమల కేంద్రం అధికారులు పాల్గొనే ఈ సదస్సుకు జిల్లాలోని లబ్ధిదారులు హాజరుకావాలని సూచించారు.

పెద్దాస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కాయకల్ప బృందం శనివారం పరిశీలించింది. నిర్మల్ జిల్లా ఆస్పత్రికి చెందిన వైద్యులు రాథోడ్ కపిల్ నాయక్ ఆధ్వర్యాన నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణవేణి, రిజ్వాన్, సంపత్‌కుమార్‌తో కూడిన బృందం ఆస్పత్రికి రాగా వారిని సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం బృందం సభ్యులు ఆస్పత్రి సేవలు, రికార్డులను పరిశీలించారు. మరో మారు పరిశీలన అనంతరం అర్హత సాధిస్తే కాయకల్ప అవార్డు ప్రకటించనున్నారు. జిల్లా ఆస్పత్రికి అవార్డుకు ఎంపికైతే రూ.50 లక్షలు అందనున్నాయి. గతంలో రెండు సార్లు కాయకల్ప అవార్డు సాధించగా, మూడోసారి కూడా పోటీ పడుతుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు.

ఉద్యోగులు హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలి



ఉద్యోగుల హాజరును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

మధిర: ప్రతీ ఉద్యోగి తాను పనిచేసే చోటే నివాసముంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి సూచించారు. మండలంలోని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు వివరాలతో పాటు వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్‌కు పలు సూచనలు చేశారు. అన్ని ఆరోగ్య పథకాల లక్ష్యాలను పూర్తి చేయడమే కాక కంటివెలుగుపై విస్తృతం చేయాలని సూచించారు. మధిర ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్, వైద్యులు సురేష్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీ

మధిర: మధిరలోని హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ సోమశేఖరశర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న మన ఊరు–మనబడి పనులను ఎంఈఓ వై.ప్రభాకర్‌తో కలిసి పరిశీలించాక, పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులపై మరింత శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఇక ఆత్మీయ భేటీలు!



- నియోజకవర్గాల వారీగా నిర్వహణకు మాజీ ఎంపీ 'పొంగులేటి' నిర్ణయం
- తొలుత పినపాక సమావేశం ఈనెల 10న..
- మరోపక్క ఉమ్మడి జిల్లాలో స్పీడ్ పెంచిన బీఆర్ఎస్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లా రాజకీయాలు రోజురోజుకు రసకందాయంలో పడుతున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు, తన టీమ్ అంతా పోటీకి సిద్ధమని ప్రకటించడం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. ఆ తర్వాత ఆయన భద్రతను కుదించడం అనుచరగణంలో అసహనాన్ని తెప్పించాయి. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలు అడుగు ముందుకేసి ఆయనపై పరోక్షంగా విమర్శలు చేయడం రాజకీయాన్ని మరింత హీటెక్కించాయి. ఈ పరిణామాల పర్యవసానం ఎలా ఉన్నా.. పొంగులేటితోపాటు ఆయన అనుచరగణం మరింత దూకుడుగా వెళ్లాలని నిర్ణయించుకుని, ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు కార్యాచరణను రూపొందించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే 10న పినపాక నియోజకవర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు.

మరోవైపు పొంగులేటి దూకుడుకు దీటుగా బీఆర్ఎస్ కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యక్రమాల్లో వేగం పెంచడం గమనార్హం.

పినపాక నియోజకవర్గంతో షురూ..

మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ నుంచి పొంగులేటితో పయనించారు. 2014 ఎన్నికల్లో పినపాక నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించగా, పొంగులేటితోపాటు ఆయన టీఆర్ఎస్‌లో చేరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినా అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి రేగా కాంతారావు చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం రేగా టీఆర్ఎస్‌లో చేరగా, పాయంకు పార్టీపరంగా ప్రాధాన్యత తగ్గింది. ఉమ్మడి జిల్లాలో తొలి నుంచి పొంగులేటి ప్రధాన అనుచరుడిగా ఉన్న వెంకటేశ్వర్లు, నూతన సంవత్సర వేడుకలకు హాజరుకావడంతో ఆయనతోనే నడిచేందుకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. ఇక మణుగూరు మండలం తోగ్గూడెం సమ్మక్క – సారక్క దేవాలయం వద్ద ఈనెల 10న పినపాక నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అనుచరగణానికి ఆహ్వానాలు పంపారు. పినపాకతో మొదలయ్యే ఆత్మీయ సమావేశాలు మిగిలిన నియోజకవర్గాల్లోనూ త్వరలో ఏర్పాటు చేసేందుకు పొంగులేటి అనుచరగణం కసరత్తు చేస్తోంది. ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాల్లో సమావేశాల నిర్వహణకు సిద్ధమైనట్లు సమాచారం. మున్ముందు రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నా.. కేడర్‌కు టచ్‌లో ఉండేందుకే ఈ సమ్మేళనాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెబుతున్నారు.

దీటుగా జోరు పెంచిన బీఆర్ఎస్..

పొంగులేటి అడుగులకు దీటుగా బీఆర్ఎస్ కూడా ఉమ్మడి జిల్లాలో జోరు పెంచింది. పొంగులేటి పార్టీపై వ్యాఖ్యలు చేసిన తర్వాత కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడం చర్చనీయాంశమైంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలిసినట్లు ప్రచారం సాగుతున్నా... రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ తర్వాత రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పర్యటించారు. రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు ప్రజల కోసం అభివృద్ధి చేస్తున్న తమ ఎమ్మెల్యేలను ఆశీర్వదించాలంటూ ఏకంగా ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా ప్రసంగించడం గమనార్హం. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా ఈ రెండు, మూడు రోజుల్లోనే పాలేరు, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. సంక్రాంతి తర్వాత బీఆర్ఎస్ కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల్లో మరింత దూకుడుగా కార్యక్రమాల నిర్వహణకు రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది.

భద్రత తగ్గింపుతో..

నూతన సంవత్సరం సందర్భంగా పొంగులేటి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న తన అనుచరులతో ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం పేరిట భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలతో పొంగులేటి రాజకీయ ప్రస్థానంపై జోరుగా చర్చ సాగింది. అనంతరం 3+3 ఉన్న భద్రతను 2+2కు కుదించగా, ఎస్కార్ట్ వాహనం, ఇంటి వద్ద గార్డ్‌ను ప్రభుత్వం తొలగించింది. ఈ చర్యలతో ఆయన వర్గం అసహనానికి గురైంది. ఇక ఈ ఆదివారం పొంగులేటి ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు చెబుతూ క్యాంప్ కార్యాలయం నుంచి షెడ్యూల్ విడుదల చేశారు.

తొలుత రాజీ యత్నం.. ఆ తర్వాతే తీర్పు

- వచ్చేనెల 11న జాతీయ లోక్‌అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు

ఖమ్మంలీగల్: వివాదంలో ఉన్న ఇరుపక్షాలు గెలుపొందాలంటే లోక్ అదాలత్ ద్వారా రాజీ పడడం ఒక్కటే మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. వచ్చేనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహక చర్యల్లో భాగంగా శనివారం పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తులు కానీ సంస్థలు కానీ పరస్పరం చేసుకోకపోవడం వల్లే వివాదాలు కోర్టుల వరకు చేరుతున్నాయని తెలిపారు. వివా దాలను మొదట రాజీమార్గంలో పరిష్కరించే ప్రయత్నం చేయాలని, ఆతర్వాతే తీర్పు విషయం ఆలోచించాలని చెప్పారు. లోక్ అదాలత్‌లో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ఇక్కడ జారీ అయ్యే తీర్పు అంతిమమైనది కాగా అప్పీల్ కూడాఉండదని వివరించారు. ఖమ్మంలోని మొదటి అదనపు జిల్లా కోర్టును మానవ హక్కుల కోర్టుగా హైకోర్టు గుర్తించినా, మానవ హక్కుల ఉల్లంఘన కేసులేవి పెండింగ్‌లో లేవని తెలిపారు. దీనికి కారణం ప్రజల్లో మానవహక్కుల చట్టంపై అవగాహన లేకపోవడమేనని చెప్పారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా మాట్లాడుతూ గత జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలవగా, ఈసారి కూడా ఎక్కువ కేసుల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని సూచించారు. న్యాయమూర్తులు ఎన్.సంతోష్‌కుమార్, ఎన్.అమరావతి, ఎస్.వెంకట హైమపూజిత, పి.మౌనిక, ఆర్.శాంతిలత, చిట్‌ఫండ్ కంపెనీల న్యాయవాది చంద్రశేఖరగుప్తా, పోలీసు అధికారులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలల రక్షణతోనే సమాజ శ్రేయస్సు

రేపటి పౌరులైన బాలలను సంరక్షించినప్పుడే మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి శ్రీనివాసరావు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను శనివారం సాయంత్రం ఆయన పెవిలియన్ మైదానంలో ఆవిష్కరించి మాట్లాడారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, పోలీసు అధికారి ప్రసన్నకుమార్, జిల్లా కోర్టు నాజర్ కె.రాధేశ్యాం, సాంకేతిక అధికారి ఎస్.ఓంకార్ పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత


- గంగారంలో అత్యల్పంగా 15.5 డిగ్రీలు




ఖమ్మంవ్యవసాయం: ఒక్కసారిగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల మేరకు నమోదైనా రాత్రి మాత్రం బాగా తగ్గిపోయాయి. జిల్లాలో రాత్రి 8 గంటల తర్వాత 15.5 నుంచి 24.1 డిగ్రీ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా సత్తుపల్లి మండలం గంగారంలో 15.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురంలో 24.1 డిగ్రీలుగా నమోదైంది. కాగా, శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి మొదలైన చలి క్రమంగా పెరుగుతూ వచ్చింది. దీనికి తోడు ఈదురుగాలులు జత కావడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇక చలి తీవ్రతతో రాత్రి 8 గంటల వరకే దాదాపు అన్ని రహదారులపై జన సంచారం బాగా తగ్గింది. అత్యవసర పనులపై వచ్చిన వారు స్వెటర్లు ధరించి కనిపించారు.

సమ్మెలో గిరిజన వసతిగృహాల సిబ్బంది

- వేతనాల కోసం ఆందోళన బాట
- ధర్నా చౌక్‌లో నిరవధిక దీక్ష
- నిర్వహణకు ఇబ్బంది పడిన ఉద్యోగులు



ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న వర్కర్లు



భోజనం సిద్ధంచేయిస్తున్న ఏటీడీఓ తిరుమలరావు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని గిరిజన కళాశాల వసతిగృహా(పీఎంహెచ్)ల ఔట్ సోర్సింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. గత 39 నెలలుగా తమకు వేతనాలు ఇవ్వకపోగా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం లేదంటూ ఆందోళన చేపట్టారు. ఈమేరకు శనివారం ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధులను బహిష్కరించి జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. కార్మి కులు బదావత్ లక్ష్మా, సంతోష్, లక్ష్మీదేవి, వీరమ్మ, మోహన్, గురవమ్మ తదితరులు పాల్గొనగా, సీఐటీయూ నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, నాయకులు వై.విక్రమ్ సంఘీభావం తెలిపారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు

వేతనాలు ఇప్పించాలని కొన్ని రోజులుగా అధికారులు చుట్టు ప్రదక్షిణలు చేస్తున్న కార్మికులు చివరకు ఆందోళన బాట పట్టారు. శనివారం నుండి సమ్మెకు దిగగా... కళాశాల వసతిగృహాల్లో విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూసేందుకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. జిల్లాలోని 11 గిరిజన కళాశాల వసతిగృహాల్లో 57 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను తీసుకున్నారు. వీరిలో 35 మంది విధుల్లో ఉండగా.. మిగతావారు మానేశారు. ఇప్పుడు ఉన్నవారూ విధులు బహిష్కరించడంతో రోజువారి వేతనంతో పనిచేసే కార్మికులతో ఆయా వసతిగృహాల్లో పనులు చేయించారు. అలాగే, జిల్లాలోని గిరిజన ప్రీ మెట్రిక్ వసతిగృహాల కార్మికులకు కొందరికి కళాశాల వసతిగృహాల్లో విధులు కేటా యించారు. అయితే, దినసరి కార్మికులతో పనిచేయించడంలో అధికారులు ఇబ్బంది పడ్డారు. మరోపక్క కొందరు నాలుగో తరగతి ఉద్యోగులు అతిథిగృహాల వద్ద, జిల్లా ఉన్నతాధికారుల వద్ద పనిచేస్తూ కొన్నాళ్ల నుంచి వసతిగృహాల దిక్కు చూడడం లేదు. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెకు దిగినా వీరిని హాస్టళ్లకు పంపించకపోవడం విమర్శలకు తావిచ్చింది.

త్వరలోనే వేతనాలు వస్తాయి..

ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు మంజూరయ్యాయి. ఈనెల 4వ తేదీన జిల్లా ట్రెజరీకి చెక్కు వెళ్లింది. త్వరలోనే కార్మికుల వేతనాలు బ్యాంక్ ఖాతాల్లో జమవుతాయన్నారు. అయితే, కార్మికులకు సమ్మెకు దిగడంతో హాస్టళ్లలో ఇబ్బంది ఎదురుకాకుండా రోజువారీ వర్కర్లను కేటాయించాం. – కృష్ణనాయక్, ఎస్టీడీడీ, ఖమ్మం

కొమ్మకొమ్మకో సన్నాయి



వల్లభిలో సన్నాయి శిక్షణలో యువత



- మార్మోగుతున్న వల్లభి ఘనత
- శిక్షణ, ప్రదర్శనల్లో రాష్ట్రంలోనే మేటి
- ప్రముఖ ఉత్సవాలు ఎక్కడ జరిగినా ఇక్కడి వారే..
- వంశపారంపర్యంగానే కాక ఆసక్తితో నేర్చుకుంటున్న పలువురు

SUNDAY SPECIAL

ముదిగొండ: ఇప్పుడు ఎక్కడ పెళ్లి జరిగినా... ఏ చిన్న వేడుక అయినా డీజేలు, బాజాభజంత్రీలు, డప్పుచప్పుళ్లు సర్వసాధారణమయ్యాయి. ఈరోజుల్లో సన్నాయి సంగీతం వినాలంటే ఎవరికీ ఆసక్తి ఉండకపోవచ్చు. కానీ ఒక్కసారి జిల్లాలోని ముదిగొండ మండలం వల్లభికి వెళ్తే సన్నాయి, నాదస్వరంలోని మాధుర్యమేమిటో తెలుసుకోవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఎక్కడ ఆలయాల్లో ఉత్సవాలు జరిగినా, ఇతర వేడుకలు నిర్వహించినా వల్లభి కళాకారుల సన్నాయి రాగాలు వినిపిస్తాయి. గ్రామానికి చెందిన దాదాపు 120మంది ఇప్పటికే సన్నాయిలో తర్ఫీదు పొంది కుంభమేళాలు, బ్రహ్మోత్సవాలు, దేవాలయాల ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాల్లో తమ కళను ప్రదర్శిస్తుండడం విశేషం.

నిత్యం శిక్షణ

వల్లభి వాసులు పలువురు సన్నాయి నేర్చుకుని ప్రదర్శనలు ఇవ్వడంతోనే సరిపెట్టుకోకుండా మరి కొందరిని కూడా తీర్చిదిద్దుతున్నారు. వీరిలో పలువురు వంశపారంపర్యంగా నేర్చుకుంటుండగా, మరికొందరు ఆసక్తితో నేర్చుకుంటున్నారు. ఇదిపక్కన పెడితే శిక్షణ ఇచ్చే వారెవరూ కూడా డబ్బు తీసుకోకుండా ఉచితంగా విద్య నేర్పిస్తుండడం విశేషం. సన్నాయి పూర్తిస్థాయిలో నేర్చుకునేందుకు మూడు నుంచి ఐదేళ్ల సమయం పడుతుందని చెబుతున్నారు. అయితే, విద్యార్హతలతో నిమిత్తం లేకుండా నేర్చుకునే అవకాశం ఉండడంతో పలువురు శిక్షణ పొంది, పక్క జిల్లాలకే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనే ప్రదర్శనలకు వెళ్తూ ఉపాధి పొందుతున్నారు. కాగా, ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకుంటే ఒక్క సంవత్సరంలో కనీస పరిజ్ఞానం వస్తుందని చెబుతారు.

వరసలు ఇవే..

సన్నాయిలో పెద్దజంటలు, అలంకారాలు, పిల్లారిగీతాలు, స్వరజతులు, వర్ణాలు, తానవర్ణం, పదవర్ణాలు, జంపెతాళం వర్ణములు, అట తాలవర్ణములు ఉంటాయని గురువులు చెబుతున్నారు. కాగా, వల్లభిలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్న చెందిన ఇరవై మందిలో ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన వారుండగా, మరికొందరు ఇతర గ్రామాల యువకులు సైతం నేర్చుకుంటున్నారు. ప్రస్తుత తరం యువత రకరకాల ఉపాధి అవకాశాలు ఎంచుకుండగా... ఈ యువకులు మాత్రం సన్నాయి వాయిద్య కళాకారులుగా ఎదిగేందుకు శిక్షణ తీసుకుంటుండడం.. గురువులు ఆసక్తిగా నేర్పిస్తుండడంతో 'వల్లభి' కళ రాష్ట్రాలు దాటుతోంది.

శిక్షణ పూర్తికావొచ్చింది..



ఐదేళ్లుగా సన్నాయి నేర్చుకుంటూనే తరచుగా పోగ్రాంలకు వెళ్తున్నా. గురువు వద్ద సాధన ఎంతో ఉపయోగపడుతోంది. సన్నాయి సంగీతాన్ని శుభసూచికంగా, గౌరవంగా భావించి శుభకార్యాలకు పిలుస్తుంటారు. ఇప్పటికే అనేక ప్రోగ్రాంలకు గురువతో కలిసి వెళ్లొచ్చాను. మాకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇచ్చారు. – ఆర్.నరేష్

మా గురువు స్ఫూర్తితో ఉచిత శిక్షణ



మా గురువు సైదులు ప్రఖ్యాత సన్నాయి కళాకారుడుగా పేరొంది మాలాంటి ఎందరికో నేర్పించాడు. వల్లభికి ప్రథమ గురువుగా కూడా ఆయనే. గ్రామంలో 120మందికి పైగా సన్నాయి, డోలు, వాయిద్య కళాకారులుగా ఉండడం ఆయన చలువే. అందుకే మేం కూడా మరికొందరికి ఉచిత శిక్షణ ఇస్తున్నాం. – షేక్ నాగరాజు, సన్నాయి గురువు

వల్లభికి మంచి పేరుంది



వల్లభి కళాకారులు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆలయాల్లో బ్రహ్మోత్సవాలతో పాటు కుంభమేళాల సమయాన మంచి ఆదరణ ఉంటుంది. భుక్తి కోసం ప్రదర్శనలు ఇస్తునే మరికొందరికి శిక్షణ ఇస్తున్నాం. మా గ్రామ కళాకారులం రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు సాధించాం. – షేక్ యాకూబ్ సాహెబ్, సన్నాయి గురువు

చిన్నతనం నుంచే ఇష్టం



చిన్నప్పటి నుంచి సన్నాయి సంగీతం అంటే ఎంతో ఇష్టం. ఆ ఆసక్తితోనే శ్రద్ధగా శిక్షణ తీసుకుంటున్నాను. ఇప్పటికే అనేక కార్యక్రమాల్లో ప్రదర్శనలకు కూడా వెళ్లాను. ఇదే సమయాన సాధన మాత్రం మరవడం లేదు. మరోపక్క సన్నాయిలో మరింత రాటుదేలాక ఇంకొందరికి శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తా. – షేక్ సలీమ్, వల్లభి

చదువుతూ నేర్చుకున్నా



చిన్నతనం నుంచే సన్నాయి సాధన మొదలుపెట్టాను. పదో తరగతి పూర్తయ్యే నాటికి సన్నాయి సంగీతం నేర్చుకున్నాను. అన్ని రాగసరావళి, వరసలు, జంటలు నేర్చారు. పలు చోట్ల శుభకార్యాలకు పిలిస్తే వెళ్తుంటాం. మన జిల్లానే కాకుండా పక్కన జిల్లాలు, ఏపీలోని పలు కార్యక్రమాల్లోనూ ప్రదర్శన ఇచ్చాం. –షేక్ మస్తాన్, వల్లభి

గొల్లకురుమలకు చేయూతనిస్తున్నాం

- విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న సీఎం
- గోపాలమిత్రల సేవలు విలువైనవి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన ఎంపీ నాగేశ్వరరావు తదితరులు

వైరా: గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యులు లేనిచోట గోపాలమిత్రలు అందిస్తున్న సేవలు విలువైనవని.. అత్యవసర వైద్యాన్ని కూడా అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కొనియాడారు. వైరాలోని పశగణాభివృద్ధి సంస్థ ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా గోపాలమిత్రలకు కృత్రిమ గర్భధారణ, ఆధునిక సాంకేతికతపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ గొల్లకురుమలను ఆదుకునేందుకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టగా, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. అన్నివర్గాల ప్రజలు, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వ్యవసాయంలోనే కాక పాడి సంపద, మాంసపు ఉత్పత్తుల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని మంత్రి తెలిపారు. వెటర్నటీ వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమే అయినా, గోపాలమిత్రలకు గతంలో కంటే మెరుగైన జీతభత్యాలు ఇస్తుండడంతో పోస్టులకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. కాగా, గోపాలమిత్రలు కృత్రిమ గర్భధారణ విషయంలో జాగ్రత్తలు పాటించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం పలువురు గోపాలమిత్రలను మంత్రి సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొర్లకంట నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల జేడీఏహెచ్‌లు వేణుమనోహర్, పురందర్, ఈఓ కిషోర్, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో కవలలకు జన్మనిచ్చిన నస్రీన్

ఏన్కూరు: ఓ గర్భిణి 108 అంబులెన్స్‌లో ఇద్దరు మగపిల్లలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీపిల్లలు క్షేమంగా ఉన్నారు. మండలంలోని తూతకలింగన్నపేటకు చెందిన ఎస్‌కే నస్రీన్‌కు శనివారం పురిటి నొప్పులు వస్తుండగా 108కు సమాచారం ఇచ్చారు. దీంతో వాహనంలో వచ్చిన సిబ్బంది నస్రీన్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా వైరా వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో డాక్టర్ చక్రవర్తి సూచనలతో మెడికల్ టెక్నీషియన్ రామారావు సాధారణ కాన్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కవల మగపిల్లలకు జన్మనివ్వగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు జిల్లాలో మాజీ ఎంపీ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలంలోని దానవాయిగూడెం, ఆరెకోడు గ్రామాలు, చింతకాని మండలంలోని మత్కేపల్లి, నామవరంతోపాటు కొణిజర్ల మండలంలోని పెద్దగోపతి గ్రామాల్లో ఆయన పర్యటిస్తారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పలు కార్యక్రమాల్లో పాల్గొననుండగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

టాలెంట్ టెస్ట్‌కు స్పందన



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ స్టేట్ సోషల్ స్టడీస్ ఫోరం (టీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యాన జిల్లాస్థాయి సాంఘికశాస్త్రం టాలెంట్ పరీక్ష శనివారం నిర్వహించగా మంచి స్పందన లభించింది. ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాలలో పరీక్ష నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ముగ్గురు చొప్పున విద్యార్థులకు బహుమతులు అందించినట్లు ఫోరం బాధ్యులు భీమరాజు, కృపాబాలనందం తెలిపారు. ఆ తర్వాత టీఎస్ఎస్‌టీఎఫ్ నూతన అధ్యక్షుడిగా టి.భీమరాజు, ప్రధాన కార్యదర్శిగా కృపాబాలానందం, కోశాధికారిగా శచేంద్రబాబు, గౌరవ అధ్యక్షుడిగా కనపర్తి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

కంటి వెలుగు వాహనాల కోసం దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సామగ్రి చేరవేత, ఉద్యోగుల కోసం వాహనాలు అద్దెకు తీసుకోనున్నారు. ఏడు చొప్పున సీట్లు కలిగిన 55 వాహనాలు సమకూర్చేందుకు ఆసక్తి ఉన్న వారు అన్ని పత్రాలతో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి సూచించారు. డ్రైవర్, యజమాని ఒకరే ఉన్న వాహనాలు మాత్రమే అద్దెకు తీసుకుంటామని తెలిపారు.

బావిలో పడి రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక గ్రామానికి చెందిన రైతు తోట చంద్రయ్య (53) వ్యవసాయ బావి వద్ద మోటార్ స్విచ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రైతు చంద్రయ్య రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఆ తర్వాత ఆయన రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో అన్నిచోట్ల ఆరా తీసిన కుటుంబీకులు శనివారం ఉదయం అనుమానంతో పొలం వద్ద వ్యవసాయ బావిలో పరిశీలించారు. దీంతో మృతదేహం తేలుతుండగా, మోటార్ ఆన్ చేసే క్రమంలో జారి పడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. చంద్రయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, ఘటనపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,925	6,925
కందులు	6,912	5,000
వేరుశనగ	7,295	7,295
పత్తి	8,300	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.13,881

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రూ.9.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- హాజరైన ఎంపీ నాగేశ్వరరావు, సీఎల్పీ నేత భట్టి



బనిగండ్లపాడులో ఆస్పత్రికి శంకుస్థాపన చేసిన మంత్రి అజయ్‌కుమార్, పక్కన ఎంపీ నామా, సీఎల్పీ నేత భట్టి తదితరులు



ఖమ్మంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి

ఎర్రుపాలెం: వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వాన మరోసారి అధికారం చేపట్టబోతున్నామని, బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఎర్రుపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి పువ్వాడ హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.9.60 కోట్లతో చేపట్టనున్న, చేపట్టిన బనిగండ్లపాడులో ప్రభుత్వ ఆస్పత్రి భవనం, బనిగండ్లపాడు నుంచి తక్కెళ్లపాడు బీటీ రోడ్డు రెన్యూవల్‌కు శంకుస్థాపనతో పాటు జెడ్పీ పాఠశాల అదనపు తరగతి గదులు, ఎర్రుపాలెంలో కేజీబీవీ అదనపు భవనం, భీమవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం బనిగండ్లపాడు సొసైటీ కార్యాలయ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి పువ్వాడ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో గెలిచేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాకు రెండు మెడికల్ కాలేజీలు మంజూరు చేసిన సీఎం.. సీతారామ నీటిపారుదల ప్రాజెక్టుతో భూములకు సాగునీరు అందిస్తున్నారని తెలిపారు.

పార్టీకి కార్యకర్తలే గుండెకాయ..

కార్యకర్తలే పార్టీకి గుండెకాయ అని.. కార్యకర్తలెవరైనా సరే తమను అపాయింట్‌మెంట్ లేకుండా కలవొచ్చని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. కేసీఆర్ సీటు ఇస్తే కార్యకర్తలందరూ కలిసి ఓట్లేస్తేనే తాము ఈ పదవుల్లో ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పార్టీలో కేసీఆర్ ఒక్కరే నాయకుడని ఆయనకు మాత్రమే జిందాబాద్ కొడితే సరిపోతుందని, కనపడిన ప్రతి ఒక్కరికీ అవసరం లేదని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన బంజర సర్పంచ్ బానోతు రంగా బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో విత్తనాభివృద్ధి సంస్థ కొండబాల కోటేశ్వరరావు, రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, డీఈఓ సోమశేఖర శర్మ, డీఎంహెచ్‌ఓ మాలతి, ఎస్ఈ సురేందర్, మధిర మార్కెట్ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత, తహసీల్దార్ తిరుమలాచారి, ఎంపీడీఓ శ్రీనివాసరావుతో పాటు చావా రామకృష్ణ, రంగిశెట్టి కోటేశ్వరరావు, మొగిలి అప్పారావు, జంగా పుల్లారెడ్డి, శీలం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రి, ఎంపీ పర్యటన సందర్భంగా బనిగండ్లపాడులోని వైన్స్‌ను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రెండు గంటలపాటు మూసివేయించడం గమనార్హం. ఇక కేజీబీవీకి మంత్రి వచ్చిన సమయాన విద్యార్థినులతో స్వాగత ఏర్పాట్లుచేయగా మంత్రి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

మంచైనా, చెడైనా.. ప్రజలతోనే ఉన్నా

ఖమ్మంమయూరిసెంటర్: తొమ్మిదేళ్లుగా మంచైనా, చెడైనా ప్రజలతోనే ఉన్నానని, సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికి చేర్చడం, సమస్యలు తెలుకుని పరిష్కరించడం విధిగా నిర్వర్తించానని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో 159 మంది కుటుంబాలకు రూ.69,25,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి, గొడవలు తెచ్చి, ఓట్లు పొందేందుకు యత్నిస్తున్న బీజేపీ నేతలకు గుణపాఠం చెప్పాలని సూచించారు. రాబోయే రోజుల్లో చాలా మంది సానుభూతితో ఓట్ల కోసం వచ్చే అవకాశమున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. మేయర్ పునుకొల్లు నీరజ, టీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మార్కెట్, సుడా చైర్మన్లు లక్ష్మీప్రసన్న, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల సేవలను సద్వినియోగం చేసుకోండి

డీసీసీబీ చైర్మన్ నాగభూషణం



గోదాంను ప్రారంభిస్తున్న చైర్మన్, ఎమ్మెల్యే

కూసుమంచి: సహకార సంఘాల ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సూచించారు. కల్లూరిగూడెం సహకార సంఘం ఆధ్వర్యాన మండలంలోని జుజుల్‌రావుపేటలో రూ.63 లక్షలతో వ్యయంతో నిర్మించిన వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాంను పాలేరు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డీసీసీబీ ఆధ్వర్యాన ఇప్పటి వరకు 75 గోదాంలను నిర్మించామని చెప్పారు. సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలే కాకుండా రైతుల పిల్లల విదేశీ చదువులకు రుణాలు ఇస్తున్నామని వెల్లడించారు. కల్లూరిగూడెం సహకార సంఘం చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీఓ నర్మద, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ మండడి పద్మ, ఏడీఏ విజయచంద్రతో పాటు రామసాయం బాలకృష్ణారెడ్డి, బానోత్ సుజాత, నలబోలు చంద్రారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు గర్హనీయం



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: బాధ్యత గల పదవిలో ఉన్న రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాలేరు నియోజకవర్గంలో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల పాలేరు కార్యాలయ ఇన్‌చార్జ్ నంద్యాల రవీందర్‌రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం సాయిగణేశ్‌నగర్‌తో పాటు నేలకొండపల్లిలో శనివారం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎవరికీ ఏజెంట్‌గా రావాల్సిన అవసరం వైఎస్సార్ కుటుంబానికి లేదని చెప్పారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఇప్పటికీ వైఎస్సార్ నిలిచే ఉన్నారని తెలిపారు. పాలేరు నుంచి పోటీ చేయనున్నట్లు షర్మిల చేసిన ప్రకటనతో బీఆర్‌ఎస్ నేతలకు ఆందోళన మొదలైందని చెప్పారు. సమావేశాల్లో నాయకులు పసుపులేటి సైదులు, గుగులోత్ రూప్లానాయక్, గుడవర్తి స్వరూపారాణి, ఉపేందర్, నాగేశ్వరరావు, లావూరి కోటేశ్వరరావు, రేలా నరసింహారెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత బీజేపీలో చేరికలు



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మంమామిళ్లగూడెం: సంక్రాంతి పండుగ తర్వాత బీజేపీలో చేరికలు ఉంటాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. బీజేపీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు జేపీ నడ్డా, బండి సంజయ్ వర్చువల్‌గా ఏర్పాటుచేసిన సమావేశానికి ఖమ్మం నుంచి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం భద్రత తగ్గించడం కుట్ర పూరిత చర్య అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకురాలు ఉప్పల శారద మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు దేవకి వాసుదేవరావు, శ్రీనివాస్, రుద్రప్రదీప్, అల్లిక అంజయ్య, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ గుప్తా, మార్తి వీరభద్రప్రసాద్, వెంకటనారాయణ యాదవ్, రేఖ వెంకటసత్యనారాయణ, ఉషారాణి, అనిత, వీరవెల్లి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కల్లూరు' ఉద్యోగులకు సన్మానం!



భద్రాద్రి కలెక్టర్, ఎస్పీతో అధికారులు

కల్లూరు: ఇటీవల భద్రాచలంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన, వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో విధులు నిర్వర్తించిన అధికారులను భద్రాద్రి జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం కొత్తగూడెంలో సన్మానించారు. భద్రాద్రి జిల్లా ఉద్యానవన అధికారి మరియన్న, ఉపాధి కల్పన అధికారి విజేత, డీపీఓ రమాకాంత్, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఇల్లెందు ఎంపీడీఓ అప్పారావు, చర్ల తహసీల్దార్ భరణిబాబుతో పాటు డీపీఆర్వో సన్మానం అందుకున్నారు. అయితే, వారందరూ కల్లూరు మండల వాసులు కావడం విశేషం! ఈ మేరకు వారిని సన్మానించగా మండల వాసులు పలువురు అభినందించారు.

ప్రపంచమంతా భగవత్ స్వరూపమే..

సత్తుపల్లిరూరల్: ప్రపంచంలోని సర్వ ప్రాణులన్నీ భగవత్ స్వరూపాలేనని ప్రవచనకర్త రామకృష్ణమాచార్య తెలిపారు. మండలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో అల్వా ల్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, టీటీడీ ఆధ్వర్యాన జరుగుతున్న ధనుర్మాసం తిరుప్పావై వ్రతం శనివారం 23వ రోజుకు చేరింది. ఈ సంర్బంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించాక రామకృష్ణమాచార్య మాట్లాడారు. ప్రతీ వస్తువు, ప్రాణిలోనూ ఉండే భగవంతుడే ఈ ప్రపంచాన్ని నడుపుతున్నారని చెప్పారు. విశ్వమంతా భగవత్ స్వరూప మే అయినందున ప్రతీ ప్రాణిని గౌరవించి ప్రే మించడం నేర్చుకోవాలని సూచించారు. ధర్మకర్తలు అరుణకుమారి, శాంతికుమారి, విజ యశ్రీ, స్వరూపరాణి, రమాదేవి, నాగేంద్రమ్మ, శైలజ, స్వప్న, విజయలక్ష్మి, ప్రేమలత, వరలక్ష్మి, వసంత లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

మోసాలు జరగకుండా చూడాలి



అడ్వకేట్ నోటరీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మంసహకారనగర్: అడ్వకేట్ నోటరీలు పత్రాల వాస్తవికత, సరైన అమలును ధ్రువీకరిస్తూ మోసాలు జరగకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన అడ్వకేట్ నోటరీలతో సమావేశమై పలు సూచనలు చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి, నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, ఓఎస్డీ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ లీగల్ సెల్ సూపరింటెండెంట్ రమణి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్‌కు పలువురు వినతిపత్రాలు సమర్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు తీయకుండా సేకరించడంతో పాటు ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకుడు నంబూరి రామలింగేశ్వరరావు వన్నివించగా, ఎస్‌ఐ, కానిస్టేబుల్ ప్రవేశపరీక్షలో అవకతవకలను సరిచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం

నేలకొండపల్లి: గురుకులాల్లో ఈ ఏడాది నూరు శాతం ఫలితాల సాధన లక్ష్యంతో పనిచేస్తున్నట్లు గురుకులాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీఓ) కె.ప్రత్యూష తెలిపారు. మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాలను శనివారం తనిఖీ చేసిన ఆమె అధ్యాపకులతో సమావేశమయ్యారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించేలా ఎఫ్ఎల్ఎన్ అమలు చేస్తుండగా, పది, ఇంటర్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యేలా తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల దాతల సాయంతో గ్రౌండ్‌లో చేసిన ఏర్పాట్లను ఆర్‌సీఓ పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఉజ్వలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఈవూరి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మూడు చోట్ల చోరీ... రెండు చోట్ల విఫలయత్నం



బేకరీలో పరిశీలిస్తున్న ఎస్‌ఐ స్రవంతి



సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడు

నేలకొండపల్లి: ఇటీవల మండలంలో వరస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా మండల కేంద్రంలో మూడు దుకాణాల్లో చోరీ జరగగా, మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించారు. ఇలా ఒకేరోజు ఐదు ఘటనలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఓ బేకరీలో శనివారం తెల్లవారుజామున చొరబడిన దొంగలు దాదాపు రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారు. పక్కనే ఉన్న వస్త్ర దుకాణం తలుపులు పగలగొట్టి రూ.30 వేల నగదు, మరికొంత దూరంలో ఉన్న జనరల్ స్టోర్స్‌లో వెనక తలుపులు పగలగొట్టి రూ.4 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, పక్కనే ఉన్న డెంటల్ క్లినిక్, మరో ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి వీలుకాక వెనుదిరిగినట్లు తెలుస్తోంది. కాగా, బాధితుల ఫిర్యాదుతో షాపుల్లో పరిశీలించిన ఎస్‌ఐ జి.స్రవంతి ఆధ్వర్యాన క్లూస్‌టీం చేరుకుని ఆధారాలు సేకరించడంతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

పెద్దాస్పత్రిలో వ్యక్తి మృతి

– ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



నవీన్‌కుమార్ మృతదేహం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ఆయన మృతి చెందాడని ఆరో పించిన కుటుంబ సభ్యులు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన మంచాల నవీన్‌కుమార్(42)కు జ్వరం రావటంతో ఈనెల 4న అక్కడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు సరిగా స్పందించకపోడంతో అదేరాత్రి ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. ఈమేరకు వైద్యులు వైద్యసేవలు అందిస్తుండగా, ఆయన అతని ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాకపోవడంతో శనివారం ఉదయం మృతి చెందాడు. అయితే, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన లింగస్వామి(38) పదేళ్లుగా ఖమ్మం రూరల్ మండలం తనగంపాడులో కుటుంబంతో సహా ఉంటూ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

కొంతకాలం కిందట కుటుంబ తగాదాలతో ఆయన భార్య విడాకులు తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మద్యానికి బానిసైన లింగస్వామి డిసెంబర్ 27న గడ్డిమందు తాగగా, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.


పంచాయతీ కార్మికుడు..

రఘునాథపాలెం: మండలంలోని కేవీ బంజర పంచాయతీ కార్మికుడు ఐతబోయిన ఎల్లయ్య (43) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ కలహాల నేపథ్యాన డిసెంబర్ 30న ఆయన పురుగులమందు తాగగా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

నేలకొండపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం చేశారు. అధికారులను అసభ్య పదజాలంతో దూషించడంతో వారు అతడిని పోలీసులకు అప్పగించారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన వి.వీరభద్రానికి ఎనిమిది కుంటల భూమి శంకరగిరితండా సమీపాన ఉంది. ఇటీవల ఆయన చెల్లెళ్ల తల్లిని ఒప్పించి గిఫ్ట్ డీడ్ ద్వారా భూమిని వారి పేరున నమోదు చేయించుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న వీరభద్రం శనివారం మద్యం మత్తులో తహసీల్‌కు వచ్చి, కుమారుడినైన తనకు తెలియకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారంటూ తహసీల్దార్ దారా ప్రసాద్‌తో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ నచ్చజెప్పినా వినకుండా అసభ్యపదజాలంతో దూషించటంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వీరభద్రంను తీసుకెళ్లారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



స్వప్న మృతదేహం

నేలకొండపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నేలకొండపల్లికి చెందిన అర్వపల్లి స్వప్న (40) శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వాకింగ్‌కు వెళ్లిన భర్త వచ్చాక గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. స్వప్న అనారోగ్యానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లి పద్మజారాణి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ జి.స్రవంతి కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి..

ఖమ్మంక్రైం: కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన మామిళ్లపల్లి రామాచారి (52) కారు మెకానిక్‌గా పనిచేస్తూ ఖమ్మం రాపర్తినగర్‌లోని అద్దె గదిలో ఉంటున్నాడు. కొంతకాలంగా కుటుంబ సమస్యలతో ఆయన మద్యానికి బానిస కాగా, శుక్రవారం రాత్రి స్నేహితుడిని కలిసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం స్నేహితుడు వచ్చి ఎంత తలుపు కొట్టినా తీయకపోవడంతో బలవంతంగా తీసి లోపలకు వెళ్లేసరికి రామాచారి ఉరి వేసుకుని కనిపించాడు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పత్తి లోడ్ లారీ బోల్తా

తల్లాడ: పత్తి లోడ్‌తో వెళ్తున్న లారీ తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్‌లో శనివారం బోల్తా పడింది. జూలూరుపాడు నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ రింగ్ రోడ్డు వద్ద అదుపు తప్పి బోల్తా పడడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనలో డ్రైవర్ నాగేశ్వరరావు, క్లీనర్ నాగుల్ మీరా సురక్షితంగా బయటపడగా, పోలీసు సిబ్బంది లారీని తీయించి రాకపోకలు క్రమబద్ధీకరించారు.